గలనంటారా?" అంటున్న అతని గొంతుకలో జీర మాకు స్పష్టంగా వినిపించింది. అంతలోనే సర్దుకొని "మీ లల్లూని మాకు యిచ్చేకూడదూ" అని, "ఏవోయ్! మా యింటికొస్తావా?" అంటూ వాడ్ని పైకెగరేశాడు.

"కంటే ఖర్మం గాని పెంచుకుంటే ప్రారబ్ధం అని వీడెందుకు మీకూ. నిక్షేపంలాంటి మీ పిల్లలు..." అంటున్న నన్ను ఆపి "లేరు" అని పూర్తి చేసేడు తలదించుకొని.

**(యువ, దీపావళి 10.11.1979)**

# కాంట్ యు డేర్ డియర్?

"**.... వా**రి సమయం పదకొండు పది నిమిషాల నలభై సెకండ్లు అంటోంది పక్కింటి రేడియోలో ఎనౌన్సరు.

"ఆహాఁ ఏమి గొంతుకరా నాయనా, బీడీలు కాల్చే వాడి లాగ" విసుక్కున్నారు విశ్వనాథం గారు.

"టంగ్... టంగ్" పదకొండు గంటలు కొట్టింది తాలూకా ఆఫీసు.

"తాగుబోతు వెధవ, ఇప్పుడు తెలివొచ్చింది కాబోలు ఒంటి మీదికి, నయం పన్నెండు కొట్టలేదు" ఈసారి ఆయన విసుక్కున్నది తాలూకా ఆఫీసు ప్యూనుమీద గంటలు కొట్టినందుక్కాదు. పది నిమిషాలు ఆలశ్యం చేసినందుకు.

ఆయన అన్నం తిని చెయ్యి కడుక్కుంటూ వుంటే ఎవరైనా వాచీ కరెక్టు చేసుకోవచ్చును. పదకొండు గంటల ఐదు నిమిషాలు. ఆ తరువాత చుట్ట వెలిగిస్తే పదకొండు గంటల పదిహేను నిమిషాలు ఆయన ప్రతి పనీ నిమిషాల్లోనే చేస్తారు. అసలు పొద్దున్నే ఆయన మొహం కడుక్కునే నీళ్ళ చప్పుడు వినే వాళ్ళ పక్కింటి కోడి కూస్తుందని ఆ వీధి వారి నమ్మకం.

ప్రస్తుతం ఆయన భోజనం పూర్తిచేసి చుట్ట కాల్చే ప్రయత్నంలో ఉన్నారు. అగ్గిపెట్టె కోసం "సుభద్రా" అని పిలవబోయి తలెత్తారు. ఉలిక్కిపడ్డారు. అసలాయన యాభై ఏడేళ్ళ జీవితంలోనూ ఉలిక్కిపడ్డం యిది రెండోసారి. మొదటిసారి పెద్ద కొడుకు అమెరికా వెళ్ళిన వారంరోజులకి అతని దగ్గర్నుంచి ఫోనువచ్చినప్పుడు –

యిప్పుడు, నౌబత్ పహాడ్ నడచి వచ్చి ఎదురుగా నిల్చున్నా బహుశా అంత ఉలిక్కిపడి ఉండరు. కాని ఎదురుగా నౌబత్ పహాడ్ కాదు రెండో కొడుకు బాలరాజు.

ఆ యింట్లో అతనికి ఎదురుగా గాని, వెనుగ్గా కాని చుట్టు పక్కల గాని పనిపిల్లలతో సహా ఎప్పుడు ఎవరూ నిలబడరు. ఆయన ఇంట్లో ఉన్నంతసేపూ పిల్లలు బైటే ఉంటారు. "పెద్ద వాడికి ఫస్టు క్లాసు వచ్చిందిట అనో, చిన్నవాడికి డిబేటులో సెకండు వచ్చిందిట" అనో సుభద్రమ్మ గారు చెప్తే ఓహో అనే గాని "నేను ఫస్టుక్లాసులో పాసయ్యేను నాన్నా" అని కొడుకు చెప్పడం, చాలా సంతోషం అని తండ్రి సంతోషించడం ఆ యిల్లు ఎరుగదు.

అలాంటిది ఈ వేళ ఎదురుగా చిన్నవాడు. ఆ చిన్నవాడికి యిరవైరెండేళ్ళు. రెండేళ్ళ ఉద్యోగం, తండ్రి అంటే తగని భయం వున్నాయి. యివిగాక సువర్చలంటే ప్రేమ, ఆమెని పెళ్ళి చేసుకోవాలన్న కోరికా కూడా ఉన్నాయి. ఆ చివరి రెండే ప్రస్తుతం అతన్ని తండ్రి ముందు నిలబెట్టేయి.

"ఏవిఁటి సంగతి?" అన్లేదు తండ్రి.

సంగతేవిఁటో చెప్పలేదు కొడుకు.

పది నిమిషాలైంది.

విశ్వనాథంగారి చుట్ట సగం కాలింది.

మిగతా సగం కాలిపోతే ఆయన వెళ్ళి పడుకుంటారు.

ఎలా ప్రారంభించాలో తెలీడం లేదు కొడుక్కి.

కాని ఎలాగో ప్రారంభించక తప్పదని తెలుసు.

"మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి" గొంతుక వణికినా మాట స్పష్టంగానే ఉంది.

కొడుకు తండ్రితో మాట్లాడే ముఖ్య విషయాలు రెండే. ఒకటి పెళ్ళి, రెండు పంపకాలు. సాధారణంగా మొదటి దాని తరువాతే రెండోది. మరంచేత ఇది పెళ్ళి బాపతే అయ్యుండాలి అనుకున్నారాయన. అయితే ఏ కొడుకు తండ్రితో ఎంత చనువున్నా సరే "నాకు పెళ్ళి చెయ్యండి నాన్నా" అని అడగడు నేను "ఫలానా అమ్మాయిని చేసుకుంటాను" అనే ఛాన్సుంది.

అర్జునిడి గురైనా ఎప్పుడైనా తప్పుతుందేమో కాని విశ్వనాథంగారి అంచనా మాత్రం తప్పదు. అంచేత కొడుకు చెప్పబోయే రెండో డైలాగు ఆయనకి తెలుసు.

తండ్రి "ఏవిఁటి? చెప్పు" అనో అంటే తను చెప్పదల్చు కున్నది రిహార్సలు వేసుకుంటున్నాడు కొడుకు. అరడజను సార్లు రిహార్సులు అయింది. కాని తండ్రి ఏమీ అన్లేదు. ఈ సారి మనసులో రిహార్సలు ఆగి కాళ్ళలో సన్నని వణుకు ప్రారంభ మైంది. అతి ప్రయత్నం మీద ఆ వణుకుని కాళ్ళ దగ్గరే ఆపి "నేనూ, సువర్చలా పెళ్ళి చేసుకుందాం అనుకుంటున్నాం" అన్నాడు కొడుకు. అన్న తరువాత తన ధైర్యానికి తనే భుజం చరుచు కున్నాడు.

"ప్రేమాతురాణం నభయం నలజ్జా" అన్నారెవరో. ప్రేమకి ధైర్యం అదే వచ్చేస్తుంది కాబోలు. కాబోలేమిటి? వచ్చేస్తే? ఈసారి ఉలిక్కిపడలేదు విశ్వనాథం గారు.

కాలుస్తున్న చుట్టని ఓసారి పై నుంచి కిందికి చూశారు. సినిమాలో అయితే సింబాలిజం అంటారుట. చూడ్డం అయి పోయింది.

"సువర్చలంటే?" సువర్చలంటే తనకి తెలీక్కాదు. వీడి ఆఫీ సులో పనిచేస్తోంది. ఆ మధ్య ఎప్పుడో యింటికి కూడా తీసు కొచ్చేడు. ఆ పిల్లని చూడగానే అనుకున్నాడు. తను ఈ పిల్ల ఎలాంటి మొగాణ్నైనా ఎగరేసుకుపోగలదని. ఎంతైనా తనూ మొగాడే కదా!

అయితే వీణ్ని ఎగరేస్తోందన్న మాట.

ఈసారి ఆశ్చర్యంతో నోటి మాట రాలేదు కొడుక్కి. "పెళ్ళీ లేదు పెడాకులూ లేదు గెటౌట్" అంటాడనుకున్న తండ్రి ఎవరూ, ఏమిటి అని ఆరాలు తీస్తున్నాడంటే వాతావరణం ప్రశాంతంగా వుందన్న మాట. ధైర్యాన్ని కీపిట్. అప్.

"మా కొలీగ్. ఈ మధ్య కలకత్తా నుంచి ట్రాన్సఫరై వచ్చింది"

"నాతో విషయం చెప్తున్నావా? పెర్మిషన్ అడుగుతున్నావా?"

"రెండూను"

కొడుక్కి సమాధానం చెప్పడం తాత్కాలికంగా వాయిదా వేసి "సుభద్రా" అని పొలికేక పెట్టారాయన. ఆయనకి పెంపుడు జంతువులంటే చాలా యిష్టం. చిన్నప్పుడు రెండు కుక్కల్ని పెంచేరు. సుభద్రమ్మ గారిని పెళ్ళి చేసుకున్నాక ఓ కుక్కని ఎవరికో యిచ్చేసేరు.

ఆయన కేకకి జవాబుగా ముందుగా సుభద్రమ్మ గారు, ఆవిడ వెనుక "వస్తున్నా" అన్న ఆవిడ గొంతుక వచ్చేయి.

"కూర్చో" అన్నారు విశ్వనాథంగారు.

ఈసారి సుభద్రమ్మ గారు ఉలిక్కిపడ్డారు. ఇన్నేళ్ళ కాపరంలో ఆవిడ అతని ఎదురుగా ఎప్పుడూ కూర్చోలేదు, అతను కూర్చో మనలేదు.

పెద్దపులి మేకపిల్లతో సరదాకో, సరసానికో, "దా, ఇలా వచ్చి కూర్చో" అన్నంత మాత్రాన మేకపిల్ల ఎగిరి గంతేసి గాని, వెయ్యకుండాని కూర్చోదు. సుభద్రమ్మగారు, కూర్చోలేదు. కొడుకు వేపు మాత్రం "ఏవిఁటిరా యిదంతా" అన్నట్టు చూశారు.

"నీ కొడుక్కి నువ్వంటే ఎంత ప్రేమో చూసేవా? నువ్వు పెద్దదానివై పోతున్నావు. పని చేసుకోలేకపోతున్నావని నీ కొడుకు కోడల్ని తెస్తాట్ట" అన్నారు విశ్వనాథంగారు.

నాకు తెలుసండీ! వాడు నా కొడుకు. అంతా మీలాగే వుంటారేమిటి? అని మొగుడివేపు కొంటెగాను, కొడుకు వేపు ప్రేమగాను చూడ్డానికి ఇదేం తెలుగు సినిమా కాదు, నవల అంతకంటే కాదు. అంచేత ఆవిడేం మాట్లాడలేదు వెంటనే. ఓ నిమిషం అయ్యేక మాత్రం "కూర మాడుతుందో ఏఁవిఁటో" అన్నారు. ఇంక వెళ్తాను అనే ధైర్యం లేక.

విశ్వనాథం గారిక్కావల్సింది ఆవిడ అభిప్రాయం కాదు. ఏదో మాట. అంతే! ఆయన ఏదీ పిల్లల్తో డైరెక్టుగా మాట్లాడరు.

"మాడుతోంది నీ కూరకాదు. వంశం, పరువు, ప్రతిష్ట. మనం ఛస్తే ఏం పెడతాడో కాని బతికుండగానే కొరివి పెట్టేస్తు న్నాడు. పూర్వం కొడుకంటే పున్నామ నరకం నుండి రక్షించే వాడని అర్థం. ఇప్పటి కొడుకులు ప్రత్యక్ష నరకం సృష్టిస్తున్నారు. కులం, గోత్రంలేని పిల్లని తీసుకొచ్చి నా గుమ్మం ఎక్కొద్దని స్పష్టంగా చెప్పు నీ కొడుకుతో..."

ఆ కొడుక్కి చెవుడు లేదు స్పష్టంగానే వింటున్నాడు.

"... అంత చదువు చదువుకొని, లక్షణంగా పెళ్ళి చేసుకొని, అమెరికా వెళ్ళినా పెద్దవాడు యిలాంటి వెధవ్వేషాలు ఎప్పుడైనా వేసేడా!."

మనసులోనే నవ్వుకున్నారు సుభద్రమ్మ గారు. పెద్దవాడు కోడి జాతివాడు. రెక్కలున్నా ఎగరలేకపోయేడు. వీడు ఎగర డానికి రెక్కలాడిస్తున్నాడు. చాలామంది పెంపుడు పక్షులకి రెక్కలు కత్తిరించేస్తారు. కాని అవి మళ్ళీ పెరగకా మానవు. ఎగిరిపోకా మానవు.

"... ప్రేమట ప్రేమ, ఇంత చదువు చెప్పించి, అడ్డమైన వాళ్ళ కాళ్ళు పట్టుకుని ఉద్యోగం వేయించింది వీడు కనిపించిన వాళ్ళందర్నీ ప్రేమించడానిక్కాదు, అంతగా పెళ్ళికి అర్జంటుగా వుంటే వచ్చే నెల ఈ పాటికి చేసేస్తాను. అంతవరకు బుద్ధిగా వుండమను...." ఆరిపోయిన చుట్టని వెలిగించారు విశ్వనాథం గారు.

వచ్చిన పనైపోయింది, సుభద్రమ్మ గారు వెళ్ళిపోయారు.

వచ్చిన పని కాలేదు, బాలరాజు వెళ్ళలేదు.

"ఇంతకీ మీ అభిప్రాయం..." గొణిగేడు.

"నేను తెలుగులోనే చెప్పేను"

"కేవలం మీ పరువు ప్రతిష్ఠల కోసం మా బ్రతుకుల్ని బలి తీసుకుంటారా?" ఈ డైలాగు తనది కాదు, ఆ మధ్య సువర్చలతో చూసిన ఏదో సినిమాలో హీరో అలాగే అన్నాడు. ఇలాంటి విషయాల్లో ఎంత తక్కువ మాట్లాడితే అంతమంచిది విశ్వ నాథం గారే మాట్లాడలేదు.

"మీకు కన్న కొడుకు సుఖం కంటే పరువు, ప్రతిష్టలే ముఖ్యవాఁ"? ఈ డైలాగూ తనది కాదు, సువర్చలే చెప్పింది.

వెర్రెత్తి పోయింది విశ్వనాథంగారికి. తతని అలా నిలదీ స్తున్నాడేఁవిఁటి?

"...ఔను ముఖ్యఁమే. తరతరాల పరువుని, పదిరోజుల ప్రేమకోసం వదులుకోవలసిన అవసరం నాకు లేదు. ప్రేమకేఁ విఁటి? ఎక్కడ పడితే అక్కడే దొరుకుతుంది. కావాలంటే వంద మందిని ప్రేమించు, పెళ్ళిమాట ఎత్తకుండా..."

ఛ! ఛ! ఊరికే ప్రేమించటవాఁ? ఒక బాధ్యతగల తండ్రి కొడుక్కి చెప్పవలసిన మాటలేనా యివి?

"స్వార్థానికైనా హద్దుంటుంది గదండీ!"

విశ్వనాథంగారికి వెర్రికి హద్దుంది. అసలేవిటి వీడి ధైర్యం? "నాన్నా, నాకు గోల్డ్ మెడల్ వచ్చింది" అని చెప్పలేని వాడు ముళ్ళపూడి వారి భాషలో "యూ హౌ మచ్?" అంటున్నా డంటే ఈ పవరు వీడిది కాదు. ఆ పిల్ల అసాధ్యురాలు. కాని ఆ అమ్మాయిని మెచ్చుకోవడానికిది సమయం కాదు, ముందు వీడి సంగతి తేల్చాలి.

"... నేనూ ఆ మాట అంటున్నానోయ్! నాది స్వార్థమే ఒప్పుకుంటున్నాను. నీది త్యాగమా? ఏడాది క్రితం వరకు ఎడ్రసు కూడా తెలీని అమ్మాయి కోసం, పాతికేళ్ళు పెంచిన అన్నట్టు నీ కింకా యిరవై రెండేళ్ళే కదూ, పోన్లే ఆ మూడేళ్ళు వడ్డీ అనుకో అమ్మ, నాన్నల్ని వదులుకోవడం త్యాగం. నీ పేరు చెప్పుకొని నీ చెల్లెలు పెళ్ళి కాకుండా ఆలో లక్ష్మణా అని ఏడుస్తూ యింట్లో కూర్చుంటే అది యింకా పెద్ద త్యాగం. అవును మరి ఇంత బతుకు బతికి ఈ వేళ నీ చేత త్యాగం, స్వార్థం గురించి పాఠాలు చెప్పించుకుంటాను" పాఠం వినడానికో, ఆవేశంవల్లో ఆగేరు.

"ఆవేశపడకండి. చెల్లి పెళ్ళికి యిప్పుడేం తొందరొచ్చింది. బాగా చదివిద్దాం. గాంధీగారేమన్నారో తెలుసా?"

"నాతో ఏఁవీఁ అన్లేదు. నీతో ఏవఁన్నారో తెలీదు"

హిరణ్యకశిపుడి లాంటి తన తండ్రిలోను సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉందన్న మాట. మనసులోనే మెచ్చుకున్న బాలరాజు గాంధీగారి అభిప్రాయం విశదీకరించేడు.

"ఏ తల్లి చదువుకున్నదైతే, ఆ పిల్లలు అంత బాగుపడ తారు. ప్రతి దేశం అభివృద్ధి ఆ దేశపు ఆడవాళ్ళ అభివృద్ధి మీద ఆధారపడి వుంటుంది"

విశ్వనాథం గారికి ఉపన్యాసాలంటే యిష్టం లేదు. వినే వాడుంటే ప్రతివాడు చెప్తాడు నీతులు.

"అది గాంధీగారి అభిప్రాయం అయితే కావచ్చు. మీ అమ్మకి 'అ,ఆ' లు రావు. మీరేం అడుక్కు తినడం లేదు. ఇంతకీ నా కూతురు, నా ఇష్టం. ఇందులో గాంధీగారిది కాని, గాంధారిది కాని జోక్యం అవనరసరం నీ సంగతి తేల్చు. "పిల్లత్తో ఆర్గ్యు మెంటూ పెంచుకోకూడదు. పెంచితే మాత్రం సగంలో ఆప కూడదు" అన్నది అతని నమ్మకం. మరంచేత ఈ వ్యవహారం ఇంతటితో తేలిపోవాలి.

"నేను సువర్చలనే చేసుకుంటాను" తేల్చేశాడు బాలరాజు.

తన నిర్ణయం కూడా చెప్పేరు విశ్వనాథం గారు "చేసుకో మీ అమ్మ నూతిలోకి గెంతేస్తుంది, నేను బైరాగుల్లో కలిసి పోతాను. మీ అన్నయ్య గుండెఆగిపోతుంది" దీవిస్తూ లేచి వెళ్ళి పోయేరు.

వినేవాడికి ఎంతసేపైనా చెప్తాం. కాని విననన్న వాడికి ఏం చెప్తాం? పైగా తన తండ్రి సంగతి తనకి బాగా తెలుసు. ఓ సారి ఓ మాటన్నాడంటే మరింక తిరుగు లేదు. భగవంతుడు

కూడా మరి మార్చలేదు. భగవంతుడి మాటెలా వున్నా, అన్నయ్య ఫ్రెండు రాఘవరావంటే తన తండ్రికి గౌరవం, గురీ కూడా ఉన్నాయి. అతన్ని పట్టుకుంటే....

## 2

పట్టుకోవడానికి రాఘవరావు ఉడత, పిల్లి కాదు ఆ ఊరి బిజీ డాక్టర్లలో అతనొకడు.

ఆవేళ పొద్దుట నుంచి రాఘవరావుకి పరమ చికాగ్గా వుంది. ఆ చికాకుకి కారణం పని ఎక్కువగా ఉండటం మాత్రం కాదు. అతను పనికి జడిసే మనిషి కాదు. ఇంట్లో పిల్లలు అల్లరీ కాదు. అల్లరి చెయ్యకుండా బాల బుద్ధుళ్ళలా కూర్చునే పిల్లలంటే అతనికి అసహ్యం. డబ్బు ఇబ్బందులు అతనికి తెలీవు.

మరేఁవిఁటి?

తెల్లవారు ఝామున నాలుగ్గంటలకి ఫోను పేషెంట్ల వరికైనా ఎమర్జెన్సీ ఏమో అనుకోని తీసేడు. అమెరికా నుంచి చేసింది బాలరాజు అన్న సుందర్రావు. ఫోనులో అతను మాట్లాడిన పది నిమిషాల్లో ఏడు నిమిషాలు ఏడుపే వినిపించింది. ఏడుపుకీ, ఏడుపుకీ మధ్య అర్థం అయిన సంగతి.

వారం క్రితం వాళ్ళ నాన్న ఫోను చేసేట్ట అర్జంటుగా బైల్దేరి రమ్మని – తన తమ్ముడు బాలరాజు ఏదో ప్రేమ వ్యవహారంట. ఆ సంగతి తేలేవరకు తనకి మనశ్శాంతి లేదుట. అసలీ వారం రోజులనుంచీ అన్నం తినలేదుట. ఆఫీసు కెళ్లలేదుట–తమ్ముడితో మాట్లాడమని ఆ ఫోను వచ్చిన దగ్గర్నుంచి రాఘవరావుకి మహా చికాగ్గా వుంది. సుందర్రావు మనిషి మంచివాడేకాని ఒట్టి చెవుల పిల్లి. తండ్రి గొంతుక వింటే లేచినిల్చుంటాడు. మనిషిలో ఏదైనా క్షమించవచ్చు కాని మెతకతనం మాత్రం భరించ లేము. ఇక్కడ ఈ కుర్ర వెధవ ప్రేమించినంత మాత్రాన పీకలు పోతాయా? దాని కోసం అన్నం, ఆఫీసు మానేసి ఏడవటమా? అబ్సర్డ్.

అయినా యిప్పుడీ కుర్ర జెనరేషన్‌కి యిదో ఫాషనై పోయింది. పైటా, పేంటూ వేసిన దగ్గర్నుంచీ ప్రేమించటమే ఆ తరువాత ఎవరో ఒకరు ఒప్పుకోక పోవడం, ఆత్మహత్యలు! త్యాగాలూ, ఏడుపులూ, అల్లరీను. ప్రేమంటే తనకి తెలీక్కాదు. తనూ ప్రేమించే పెళ్ళి చేసుకున్నాడు. నిజంగా ప్రేమించేవాడు గోలపెట్టనక్కర్లేదు. ప్రేమ క్కావాల్సింది ధైర్యం. అది లేని వాడు ఆడపిల్ల నీడకూడా తొక్క కూడదు.

ఈ బాలరాజు సంగతేవిఁటో?

ఘాటు ప్రేమైతే దండలు మార్చుకోమనడం, లేకపోతే జెల్ల కొట్టి పొమ్మనడం.

ఆలోచిస్తూ గుమ్మం దిగుతున్న రాఘవరావుకి గుమ్మంలోనే ఎదురయ్యాడు బాలరాజు.

"రావోయ్! రా నీ కోసమే చూస్తున్నాను"

ఆశ్చర్యంతో సిగ్గుపడ్డాడు బాలరాజు.

"గమ్మత్తుగా ఉందే, మీరు నా కోసం రావడవేఁవిఁటి?"

"కుర్రవాడివికదూ! ప్రతిదీ గమ్మత్తుగానే ఉంటుంది. మరి?"

"అయినా నువ్వు, మీ నాన్న తేల్చుకోక మధ్యలో ఎక్కడో ఉన్నవాడ్ని ఎందుకు లాగడం...?"

ఇద్దరూ డ్రాయింగు రూంలో కూర్చున్నారు.

రావడం అంటే వచ్చేడు కాని ఏం మాట్లాడాలో అర్థం కాలేదు బాలరాజుకి. ఏం చెప్పాలో ఆలోచించుకొనే లోపున రాఘవరావే ప్రారంభించేడు. మీ అన్నయ్య ఫోనులో గోల పెట్టేసేడు. సంగతేమిటో తెలీకుండా నేనేం చేస్తాను. ఏమిటీ కథ? అడిగేడు.

తగని సిగ్గేసింది బాలరాజుకి.

తలొంచుకొని గోళ్లు కొరుకుతున్నాడు.

"సిగ్గు ఆడదానికి సింగారం అవునో కాదో కాని మొగాడికి మాత్రం నప్పదు. కానీ..." అంటూ టేబిలు మీదున్న పేపరు తీశాడు రాఘవరావు.

ఎడమచేతి గోళ్ళన్నీ కొరికేసేడు బాలరాజు. కుడిచేయి నోట్లో పెట్టుకోబోతూ తలెత్తిచూశాడు. రాఘవరావు పేపరు చూస్తు న్నాడు. అమ్మయ్య తనవైపు చూడ్డం లేదు. కొంచెం సిగ్గు తగ్గింది.

"ఊ" అన్నాడు రాఘవరావు పేపరు వెనుకనుంచి.

కుడిచేతి గోళ్ళు కొరుకుడు సాయంత్రానికి వాయిదా వేసి ప్రారంభించేడు బాలరాజు.

కథేవిఁటంటే...

సువర్చల ఈ మధ్యే ట్రాన్సఫరై వచ్చింది. అప్పుడావిడతో వాళ్ళ నాన్న కూడా ఉన్నాడు. గొంగళిపురుగుల్లాంటి మీసాలు వీడూను. బాలరాజుకి గొంగళిపురుగులంటే అసహ్యం, మీసా లున్న వాళ్ళంటే.... అయినా సువర్చల కోసం అతన్ని క్షమిం

చేశాడు. "మా పిల్ల ఒంటరిది, ఊరు కొత్త, భాష కొత్త కాస్త కంట కనిపెట్టు బాబూ" అని. ఊహు తెగయిద్దై పోయాడు. అన్నట్టు సువర్చలకి బెంగాలీ, ఇంగ్లీషు తప్ప తెలుగురాదు. మరింక అప్పటినుంచి బాలరాజు ఆమెని రెండు కళ్ళతోనూ కనిపెడుతూనే వున్నాడు.

ఆఫీసులో ఆ అమ్మాయి పనై పోయి ఒంటరిగా బిక్కు బిక్కు మంటూ కూర్చుంటే తను పనివున్నా సరే, వెధవ పని తరువాత చేసుకోవచ్చును అని చెప్పి పోయి ఆవిడతో ఆ కబురూ, ఈ కబురూ చెప్పేవాడు. అలా నాలుగు రోజులు చూసిన ఆఫీసరు అయిదో రోజున బాలరాజుని పిల్చి చక్కటి చీవాట్లు పెట్టేడు.

చీవాట్లు ఉదంతం విన్న సువర్చల విరగబడి నవ్వింది. నవ్వి "వాడికేం తెలుసు ఆడపిల్లతో కబుర్లు చెప్పడంలో త్రిల్. మోస్ట్ ఆఫ్ రొమాంటిక్ ఫెలో" అన్నప్పుడు ఆ చీవాట్లన్నీ మరిచి పోయేడు. అలా.... అలా.... కబుర్లు సినిమాలయ్యేయి. అవును, సువర్చలకి సినిమాలంటే వెర్రి యిష్టం.

ఓసారి... ఆఫీసువాళ్ళంతా కార్తీక భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. అదుగో, అప్పుడే... బాలరాజుకి అనుమానం వచ్చింది సువర్చలని ప్రేమిస్తున్నావా అని. గమ్మత్తేవిటంటే అదే పిక్నిక్కులో మరో అనుమానం కూడా వచ్చింది సువర్చల తనని ప్రేమించటం లేదుకదా అని. ఆ వేళ అతనికి కాఫీ యిస్తు న్నప్పుడు ఆవిడ వేళ్ళు తగిలేయి. పొరపాటేమో అనుకున్నాడు.

వక్కపొడి యిస్తూ అరచేతితో చిన్నగా గిల్లింది. పొరపాటు కాదనుకున్నాడు. ఆ తరువాత భయం వేసింది ఆవిడ గిల్లినం దుక్కాదు, తనని ప్రేమిస్తున్నందుకు. ఆ భయం యింకా ఎక్కు వైంది. వాళ్ళ ఆఫీసులో అందరికీ వీళ్ళ ప్రేమ వ్యవహారం ఆ పిక్నిక్కుకంటే చాలా రోజుల ముందునుంచీ తెలుసని తెలిసినప్పుడు.

తరువాత ఓ పదిరోజులు మామూలుగానే గడిచేయి. పద కొండో నాడు వాళ్ళిద్దరూ సినిమాకి వెళ్ళేరు. సినిమా అయి పోయేక యింటిదగ్గర దిగబెట్టినప్పుడు మామూలు గానే గుమ్మంలో నిల్చున్న అతన్ని "లోపలికి రాకూడదా?" అంది సువర్చలే.

అంతవరకు ఎప్పుడు దిగబెట్టినా గుమ్మంలో నిల్చుని వెళ్ళి పోవడమే కాని లోపలికి వెళ్ళలేదు. సువర్చల రమ్మనగానే భయంతో కాళ్ళు వణికేయి. గుండె పాడైపోయిన హెలికాప్టరు శబ్దం చేస్తోంది. లోపలికి వెళ్ళి కూర్చున్నాక కాళ్ళ దగ్గర వణుకు నోటి వరకూ పాకింది, అతనేం మాట్లాడలేదు.

సువర్చలే మాట్లాడుతోంది, నవ్వుతోంది.

ఆవిడ నవ్వు చూస్తూ కూర్చుంటే మాటలు వినపడవు.

అంత సమ్మోహనంగా నవ్వుతుంది.

ఆవిడ మాటలు వింటూ కూర్చుంటే నవ్వు వినిపించదు.

అంత చమత్కారంగా మాట్లాడుతుంది.

మాటల మధ్యలో "ఇంతకీ మీ వాళ్ళే వంటారో?" అంది.

"ఛస్తే ఒప్పుకోరు" అన్నా, బాధగా అతనికి ఎదురుగా వున్న సువర్చల కనిపించటం లేదు. ఆవిడ వెనగ్గా తన అమ్మ, నాన్న, అన్నయ్యా వగైరాలంతా క్యూలో నిల్చున్నారు. అమ్మ ఏడుస్తోంది, నాన్న శివతాండవం చేస్తున్నాడు, అన్నయ్య దీనంగా చూస్తు న్నాడు. ఇంకా వదిన చెల్లి ఏం చేస్తున్నారో చూసే ధైర్యం లేక గబుక్కున కళ్ళు మూసుకున్నాడు.

రెండు నిమిషాలైంది.

ఈలోగా అతని జుత్తులో వేళ్ళతో రాస్తూ "కాంట్ యు డేర్ డియర్" (con't youdare dear) అంటోంది.

ఇంతవరకు ఫ్లాష్ బాక్ వింటున్న రాఘవరావు ఒక్క సారి తుళ్ళి పడ్డాడు. ఇంతవరకు యిది మామూలు ప్రేమకథే. ఇదిగో యిక్కడే మలుపు తిరుగుతోంది.

ఏవండీ? మళ్ళీ చెప్పు రెట్టించేడు రాఘవరావు.

కాంట్ యు డేర్ డియర్!

హమ్మ పిల్లా! ఏం తెలివైన దానవే. ప్రపంచంలో మహారాజు మొదటు ముష్టివాడి వరకూ ఏ మొగాడూ ఎదుర్కోలేని ప్రశ్న.

ఆడదాని బ్రహ్మాస్త్రం.

తుఫాను.

విశ్వామిత్రుడూ, వశిష్టుడూ అయినా సరే ఒక ఆడది వచ్చి "కాంట్ యు డేర్ డియర్?" అంటే, కూర్చున్న పులి చర్మాలని పీకి పారేసి మధుపర్కాలు కట్టేసుకోవాల్సిందే. ఆఫ్టరాల్ ఈ బచ్చాగాడెంత? మొత్తానికి ఆ పిల్లెవరోగాని ఉండదగ్గది.

నిజానికి ఆవిడ వీడ్ని ప్రేమించడం ఆవిడ ఖర్మ. వీడి అదృష్టం.

అలాంటి పిల్లకు ఈ నంగిరిగాడా?

"ఘటన" అంటే యిదేనేమో!

"మా నాన్న ఒప్పుకోవడం లేదు. మీ మాటేవైఁనా వింటారే మోనని" వచ్చిన పని చెప్పేడు బాలరాజు.

మీ యిద్దరి ఒప్పందాలూ తరువాత. ముందు నాకు సమాధానం చెప్పు.

ఏమిటన్నట్టు చూసేడు బాలరాజు.

"నువ్వు ఏ పరిస్థితుల్లోనూ మీ వాళ్ళని ఒప్పించలేవు" రాఘవరావు మొదటి ప్రశ్న.

"లేను" అంది అడ్డంగా వూగిన బాలరాజు బుర్ర.

"వాళ్ళ కోసం ఆ అమ్మాయిని వదులుకోగలవా?"

"లేను" అంది అదే బుర్ర.

పోనీ ఆ అమ్మాయి కోసం మీ వాళ్ళని వదులుకోగలవా?

"లేను"

"ఇలాంటి క్లాష్ వస్తుందని మొదట తెలీదా?"

మౌనం పూర్తి అంగీకారం.

"మరి ఎందుకు ప్రేమించినట్టు?" తలాయించేడు రాఘవరావు.

నవ్వొచ్చింది రాఘవరావుకి ఏం ప్రశ్న?

ఒక మొగాడు ఆడదాన్ని ఎందుకు ప్రేమిస్తాడు? అందరూ ప్రేమించినట్లే తనూ ప్రేమించేడు.

"అందరూ ప్రేమిస్తారేమో కాని, ప్రేమించే అర్హత మాత్రం కొందరికే ఉంటుంది. ప్రతివాడు ప్రేమకి అర్హుడు కాడు, అవసరమైతే ప్రపంచాన్ని ఎదిరించే ధైర్యం, తెగింపు ఉండాలి. లేదా ప్రపంచానికి నచ్చచెప్పగల నేర్పైనా ఉండాలి. ప్రేమ అనేది అర్హత ఉన్నవాడికిస్తేనే రాణిస్తుంది".

రాఘవరావు ఉపన్యాసానికి కించిత్ కోపం వచ్చింది. బాలరాజుకి. బావుంది వరస! బావున్నావా బాపనయ్యా అంటే నా పాతబాకీ ఎప్పుడిస్తావు అన్నాట్ట వెనకటికి. మా వాళ్ళని ఒప్పించవయ్యా దేవుడా అంటే నీకు ప్రేమించే అర్హతే లేదంటాడేవిఁటి?

అవతలి వాడి రియాక్షన్ తెలుసుకోలేనంత వెర్రివాడేం కాదు రాఘవరావు.

"నేనిలా అంటున్నానని నీకు కోపం వచ్చినట్టుంది. రావాలి కూడా. కాని నీ కేసే తీసుకో, మీరిద్దరూ కలిసి తిరిగేరు. మీరిద్దరూ పెళ్ళి చేసుకుంటారని మీరూ, ఊళ్ళో వాళ్ళూ కూడా అనుకున్నారు. కాని కారణాలేవైనా పెళ్ళి చేసుకోరు. తరువాత మొగాడివి కాబట్టి నీకు పెళ్ళై పోతుంది. ఆ పిల్లని మాత్రం నీతో తిరిగిన పాపానికి ఎవరూ చేసుకోరు. మీరిద్దరూ పవిత్రంగానే వున్నాం అంటావా? ఆడది పరాయి మొగాడి వేపు చూసి నవ్వితేనే అపవిత్రం అయిపోతుందనుకునే వెధవలం మనం. గతం ఎప్పుడూ ఆడదాన్నే వెంటాడుతుంది. ఆవిడ జీవితం నాశనం చేసే హక్కు నీకెవరిచ్చారు?

ఖచ్చితంగా పెళ్ళి చేసుకునే ఉద్దేశం లేకపోతే ఆడ పిల్లలవేపు వెళ్ళకూడదు. ప్రేమించడానిక్కావల్సింది అందం, ఆకర్షణ కాదు. గుండె నిబ్బరం. అది ఉన్ననాడు ఈ భగ్న ప్రేమలూ, ఈ ఆత్మహత్యలూ ఉండవు. ఏమంటావ్?"

బాలరాజు ఏమనేవాడో కాని ఈలోగా ఫోను తీసిన రాఘవరావు "అమెరికానుండి మీ అన్నయ్య" అంటూండగానే బాలరాజు "ప్లీజ్! నేను మాట్లాడతాను" అంటూ ఫోను లాగేసుకున్నాడు.

అయిదు నిమిషాలు గడిచేయి. ఈ ఐదు నిమిషాలూ అవతలి వాళ్ళు ఏం మాట్లాడుతున్నారో తెలియదు కాని బాలరాజు మాత్రం భోరున ఏడుస్తున్నాడు. రెండు నిమిషాల ఏడుపు భరించిన రాఘవరావు, మూడో నిమిషంలో పక్క గదిలోకి వెళ్ళిపోయాడు. మధ్యలో మాత్రం "నిజం అన్నయ్యా, నీ మీద ఒట్టు... అలాగే... నువ్వు మాత్రం రావద్దు. ఆఫీసు మానకు" అంటున్న మాటలు పక్కగది లోకే వినిపించేయి.

ఫోను పెట్టేసిన పది నిమిషాలకి గదిలోకి వచ్చిన రాఘవరావుతో సారీ! మీకు అనవసరంగా శ్రమ యిచ్చేను. వస్తాను అంటూ వెళ్ళిపోతున్న బాలరాజు వేపు ఆశ్చర్యంగా చూడ్డం తప్ప ఏం చెయ్యలేకపోయేడు. "యూస్ లెస్ ఫెలో" అని మాత్రం అనుకున్నాడు.

## 3

సువర్చలతో తను చెప్పవలసినవి పదిహేను రోజులు రిహార్స లేసుకున్నాడు బాలరాజు.

"ఐయామ్ సారీ సువర్చలా! నన్ను క్షమించు మర్చిపో" అంటాడతను.

మధ్యలోనే తన నోరు చేత్తో మూస్తూ "అంత మాటనకు బాలూ! నువ్వు ఏం తప్పు చేసేవని నిన్ను క్షమించమనడం. నీ

హృదయం నాకు తెలుసు. పరిస్థితులకు తల ఒగ్గక తప్పదు. నిన్ను మరచిపోవడం అంటే నన్ను నేను మరచిపోటమే. నీతో బతికే అదృష్టం లేకపోయినా, కనీసం నీ జ్ఞాపకాల్లోనైనా బతకనీ" అంటుంది.

ఇద్దరికీ కన్నీళ్ళు ఆగవు.

సువర్చలే తన కన్నీళ్ళు తుడుస్తూ "ఛ! ఛ! డోన్ట్ బి సిల్లీ! ఆడపిల్లలా ఏమిటా కన్నీరు? అనుకున్నవన్నీ జరుగుతాయా? జరిగినదంతా ఒక కమ్మని కల అనుకుందాం ఏం?" అంటుంది.

పిచ్చి సువర్చల అనుకుంటూ పదహారో రోజున ఆఫీసులో అడుగు పెట్టిన బాలరాజుకి అడుగు ముందుకి పడలేదు. సువర్చల సీటులో మరో కొత్త అమ్మాయిని చూడగానే.

సువర్చలేది?

"వారం క్రితం ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయింది"

ఇప్పుడు తను క్షమాపణ ఎవరితో చెప్పుకుంటాడు?

"ట్రాన్సఫరు కావాలనే చేయించుకుందిట" అని ఎవరో అన్నప్పుడు మాత్రం బాలరాజు నమ్మలేదు.

"నా ప్రేమ యిలాంటి వర్త్‌లెస్ ఫెలో మీద వేస్ట్ చెయ్య దల్చుకోలేదు" అని అన్నదని మాత్రం బాలరాజుకి ఈ నాటికీ తెలీదు.

**(ప్రభవ, వార్షిక సంచిక 1.2.1980)**

# ఛీ ! ఛీ !! ఏం మనుషులు !!

**భోం**చేసి నడుంవాల్చేను. ఇంకా రెండు కాళ్లూ పూర్తిగా ముయ్యనేలేదు. అంతే 'రాణీ, రాణీ" అంటూ డైనింగ్ హాల్లోంచి ఓ పొలికేక.

ఇంకెవరు ? సుందరమ్మే.

లేచే లోపున మరోపొలికేక "ఎక్కడ చచ్చావ్?"

ఆహాఁ ఏం సున్నితంతా బాబూ ! అందుకే నాకు ఈవిడంటే రోజు రోజుకీ అసహ్యం పెరిగిపోతోంది.

"అంట్ల దగ్గరికి కాకులొచ్చేయి" మరో గావుకేక.

తెలివంటే నీదేనే సుందరమ్మ తల్లీ అంట్ల దగ్గరకికాకులురాక గండ భేరుండాలు వస్తాయా? ఈ తెలివికి కథలుకూడా రాస్తుందిట. పాపం శమించుగాక !

"పక్కింటి రాజా దగ్గరికి పోయి వుంటుందమ్మా" అంటున్నాడు అరుణ్. ఈయనగారు ఎమ్.బి.ఎ. లో చేరిన క్షణం నుంచి తను "తాతా" జనరల్ మేనేజరు ననుకుంటున్నాడు. స్కూటరు లేకపోతే కాలుకింద పడదు బాబుగారికి. ఇంతకీ నా యిష్టం. రాజాతో కాకపోతే రౌడీతో తిరగడం తప్పా? వీడు తిరగడం లేదూ, యూనివర్శిటీ ఆడపిల్లలతోటి.

అప్పుడే డ్రాయింగురూములోకి వచ్చిన బొజ్జీ "యిదిగో నమ్మా ఫేన్ కింద సోఫాలో హాయిగా నిద్రపోతోంది" అంది. బావుంది జోకు. సోఫామీద కాకోతే సోఫాక్రింద నిద్రపోతారా ఎవరైనా? ఈమాత్రం బుద్ధిలేదు యీ పిల్లకి? పైగా డాక్టరుట. మొన్న పి.జి.ఎంట్రన్స్ రాసింది. ఈవిడకి సీటువస్తే నన్నడగండి.

"ఇక్కడ హాయిగా నిద్రపోతున్నావా తల్లీ" మళ్ళీ బొజ్జమ్మే.

నిజం చెప్పొద్దూ దొంగనిద్రపోతున్నాను.

"యింతకీ లేవడం లేదు వెధవ. నువ్వు కొట్టమ్మా కాకుల్ని" మరేఁ కాకుల్ని కొట్టడానికి, ఎలుకల్ని పట్టడానికీ కాబోలునేనీ యింట్లో వున్నాను!

నిజానికి వీళ్ళేం నన్ను కన్నారా?

హాయిగా మా అమ్మతో చర్చి వార్డెనుగారింట్లో వుండేదాన్ని. ఆ వార్డెను చర్చి డబ్బు తినేసేడని అందరూ అనుకున్నా నన్నూ అమ్మానీ ప్రాణంగా చేసుకునేవాడు. మా అమ్మ ఎంత బావుంటుందనీ? మల్లెపువ్వు లేదు, మల్లెపువ్వు అంత తెల్లగా ఉంటుంది. నేను పుట్టి పది రోజులైనా కాలేదు, యిదిగో యీ సుందరమ్మ మహాతల్లి నన్ను కొనేసింది. ఎంతకో తెలుసా?

ముష్టి మూడొందలకి. మూడు వేలైనా కాదు!

అసలు మా పూర్వలది ఇంగ్లండు. మా వంశంలో బ్యూటీ కాంపిటీషన్లో ప్రైజు లొచ్చిన వాళ్ళు చాలామంది ఉన్నారు. యింతకీ నా వంశం గురించి ఎంత చెప్పి ఏం లాభం? యీ సుందరమ్మ సంగతి వినండి.

ఈవిడికి మొదట యిద్దరూ కూతుళ్లు. వాళ్ళు డాక్టర్లని ఆవిడకి తెగ గర్వంలెండి. నా మొహం డాక్టర్లు. ఏనాడూ ఎవ్వరికీ యింజెక్షన్లు ఇవ్వటం నేను చూళ్లేదు. ఆ మధ్య పార్వతి –